# పావలా అంటే ఎంత?



గున్నోవ్

పైరు వరిచేలు తలనిలిపి చల్లటి పిల్లగాలికి మెల్లగా ఊగుతున్నాయి. ఆకాశంమీద పిట్టలేవో మాటలుజెప్పుకుంటూ యిటూ అటూ పోతున్నాయి. ఆపొలానికి ప్రక్కగానే ప్రవహిస్తోందో చిన్న పంటకాలువ. సూర్యుడు ప్రక్కగానున్న పడమటికొండమీద కాలుపెట్టాడు. పెద్ద కాపు రామయ్యగారు బోరవిరచుకుని, కర్ర గట్టు కానించి, ఠీవిగా నిలబడ్డాడు. వరిపైరు లాగే గర్వంగా, తన మీసాలుదువ్వుతూ, నాల్గుసార్లు పొలంపై తనదృష్టి సారించి సంతృప్తినిబొందినట్లు సూచించే ఒక చిరునవ్వు విసిరాడు. అవతల పొలంమడిలో వెంకడు నీరుమళ్లించడానికి గట్టుకు కన్నం పెడుతూన్నాడు. నల్లటి శరీరము,కండలు తిరిగిన దండలు, ఎముకలు కనిపిస్తూన్న ఛాతీ-నుదుట కారుతూన్న చెమట నప్పుడప్పుడు చేత్తోతుడుస్తూ ఉస్సురంటూ పనిజేస్తూన్నాడు. అప్పుడప్పుడు తన దృష్టిని కాపుగారివైపు చూసీ చూడనట్లుగా మలుపుతున్నాడు. ఇంతలో కాపుగారు——

'యేరా, యెంకా, ఆ కొసామళ్ళోకి నీరు మళ్ళించావా, యేం?' అన్నాడు.

'ఆ-పొద్దున్నకాడే అయినాదండి బాబూ'—— అన్నాడు దించినబుర్ర ఎత్తకుండా.

'అయితే చెరుకుతోటకూడాసరిపెట్టేశావా?'

'సానా అయిపోయినాదండి బాబయ్యా' అన్నాడు తన పని జేసుకుంటూనే.

'అది పూర్తిజేత్తావనుకున్నా.'

'ఏం చెయ్యాల బాబూ — ఒక్కణ్ణి — పొద్దున్నించీసత్తున్నా నిండనేదుపొలం'అన్నాడుదీనంగా

'మరి చెయ్యాల్రా - కట్టపడకపోతే యెలాగ?' అన్నాడు ఓదారుస్తూన్నట్లు.

'పొద్దుట కాడనుండి సాయింత్రంవరకు చేత్తాన్నేవున్నాను బాబూ ఊపిరేనా తీయకుండా' అన్నాడు వెంకడు.

'యీ కాస్త పనికీ యిలా అంటే యెలా?'

'ఎంతమాట బాబయ్యా.'తమొరలా శలవిస్తే యెలాగ బాబూ.'

'మరి జాగర్తగా జెయ్యి' అంటూ కాపుగారు ముందుకు పోవటానికి మొదలుపెట్టాడు. వెంకడు యేదో అడుగదలచుకుని సందేహిస్తున్నట్లు మొఖముంలో స్పష్టమగుతోంది. ముఖమునుండి చెమట బిందువులు ముక్కునుండి మీసాలమీద పడుతున్నాయి. యింతలో చల్లగా గాలి తెర ఒకటి వీచింది. వెంకడు నెమ్మదిగా గట్టుమీద చేరి రెండడుగులు కాపుగారి వైపు తిరిగివేసి చాలా నెమ్మదిగా - 'బాబూ' అన్నాడు. కాపుగారు వినపడనట్లు వెడలిపోతూన్నాడు. మళ్ళీ కొంచెం గట్టిగా పిలిచాడు వెంకడు, 'బాబయ్యగారూ' అని - వెనక్కు తిరిగి 'ఏం రా' అన్నాడు ధీమాగా కాపుగారు.

'యింట్లో మెతుకుల్లేవు బాబూ.'

'అయితే నన్నేం సెయ్యమంటావురా' అన్నాడు కర్ర గట్టిగా గట్టులోకి పొడుస్తూ. వెంకడు తలవాల్చి 'మూన్నాళ్లబట్టి తిండినేదు - బాబూ' అన్నాడు. కాపుగారు మాట్లాడకుండా

వరి చేను వైపు చూస్తున్నాడు. వరి పైరు వెంకడి అభాగ్యానికి జాలితో కదిలిపోయింది. వెంకడు మళ్లీ చెప్పడం మొదలు పెట్టాడు. 'బాబు,' తమరు రచ్చించి గంటి గింజలేనా కొలిపించాల-పిల్లలాకలితో మాడిపోతున్నారు. అప్పుడు మీరిచ్చినమూడు బస్తాల గంటిలే యీ అయిదు నెలలబట్టీ' అన్నాడు.

'రేపురా యింటికడకి' అన్నాడు కాపుగారు.

'బాబూ, రేతిరి కేనున్నా వుంటేగాని పిల్లలుసూరుమని పోతారు—'

'అయితే యీ పావులా తీసుకో-'అని పావలా తీసి క్రిందపడవైచి కాపుగారు శీవిగా అడుగు వేసుకుంటూ పోయారు. పావులాయే పదివేలను కుంటూ తీసుకుని తనగోచి కొంగులో పది చుట్టలు చుట్టి దాచుకుని తన పనిలోకి చొరబడ్డాడు. పని చురుగ్గానే నడుస్తూంది. ఒంట్లో సత్తువ లేక పోయినా సూర్యుడు పూర్తిగా కొండ వెనకాలకి పోయాడు. చీకటిలేదు, ఎండా లేదు. వెంకడు మడిలో నీరుతోనే చేతులు కాళ్లు కడుక్కొని యింటిముఖం పట్టాడు. నెమ్మదిగా నడుస్తూ వస్తూన్నాడు. చీకటి నెమ్మది నెమ్మదిగా పడ వస్తోంది. ఇంక వేగంగా పోకపోతే చాలా ఆలస్యం అవుతుందని కొంచెం గబగబ నడవడం మొదలు పెట్టాడు.

'ఏరోయ్ మావా-యెటంత యేగంగా పోతున్నావ్' అని వినిపించింది.

'యెవరారు' అన్నాడు కొంచెం నడక వేగం తగ్గిస్తూ. 'నేన్రా-రాముగాడిని- ఆగాస్ పోదాం' అన్నాడు నిర్లక్ష్యంగా.

'పిల్ల లేకుంటుంటారేస్'అన్నాడు వెంకడుఆగి.

'ఏరా ఏమయింది' అన్నాడు రాముడు.

'మూన్నాల్లబట్టీ కూడు నేదురా, చత్తూంటేని.'

'మీకాపంత పెద్దోడురా-మరిగంటే'అన్నాడు యింకా యేదో మాట్లాడబోయి మధ్య నాపుతూ.

'పెద్దోడు పెద్దాడే-దరిద్రుడంతకన్నా పెద్దోడ్రా-ఆరు ఆరే-మనం మనమే.'

'మనబతుకంతే-పోనిద్దూ'అన్నాడునిట్టూర్పుతో.

'బేగనడుత్తారా మరి.'

'మరి పాకలోకొత్తావా' అన్నాడు గుడ్లెగరేస్తూ రాముడు.

'యేంపాకరా - మూడురోజులనుండి తిండి నేదురా.'

'మరేంచేత్తాంలే - యీ యేళేమయినా.'

'యేదో బతిమలాడితే పావులా యిచ్చాడు.'

'చాల్రా - యిద్దరూ చెరోపాయి.'

'మరి యింటి కడరా — మూన్నాళ్లబట్టీ తాగ నేదు. పిల్లలు గోలపెడుతూ వుంటారు. యింటి కెడితే బుర్రెగిరిపోతాది.'

'కల్లుతాగరా ఆనందంగానే వుంటాది. ఏదో ఒకబేడచాల్లే-యిద్దరికీ. మిగతా బేడయింటికియ్యి.'

'బాగా చెప్పావులే - పోసిలే - బేడిత్తా- రేపు పొద్దున్నిత్తానన్నాడులే గంటిగింజలు-'

'యికనేం- కానిద్దూ- యీ యేళ. రేపు సంగతి చూడొచ్చు'అన్నాడు, రాముడుఉత్సాహకరంగా.

'నడు, మరి కట్టేత్తారు' అన్నాడు వెంకడు.

యిద్దరూ వేగంగా నడుస్తున్నారు. కల్లుపాకను సమీపించారు.

'యేరా! యెంకా! యేయిరాకడి నేదురా' అన్నాడు రాముడు.

'పొద్దో యిందిగాదూ - అందుకేస్' అన్నాడు వెంకడు.

'కానేసి- యీ పాటికి మంచి పసందుగా వుండాలిస్సింది.'

'బేగనడస్ - కట్టేత్తారేమో'

'లేదాస్ - సూడరా, మూసేసుందాస్'

పదరా - యెడవక' అంటూ వెంకడూ రాముడూ గబగబపోయారు. చూసే సరికి కొట్టుకి పెద్ద తాళం వేసుంది. అసలు విశ్రాంతి విరామం యెరుగని కొట్టుకా పెద్ద తాళాలుచూడ్డం ఆశ్చర్యం కొల్పింది. ముఖాలు బిక్కపోయాయి. ఆప్రక్కన దగ్గుతూ అరుగుమీద కూర్చున్న పెద్దమనిషిని చూసి-

'యేం బాబూ - యీ రోజు కొట్టునేదా ?' అన్నాడు రాముడు.

'తాగటం మంచిదికాదని ప్రభుత్వం కొట్లు మూయించారు.'

'రేపుంటదా బాబూ' అన్నాడు రాముడు ఆశగాచూస్తూ.

'యింకనలుండదు' అన్నాడతను కటువుగా.

రాముడు వెంకడికేసి తిరిగి 'దరిద్రం రామనది. మనకంతే - పిల్లలు పిల్లలని యేడిసి నావు-యెల్లు' అన్నాడు కోపంగా తన దారిని తనుపోతూ.

'ఆకిపీళ్ళ సిగతరగా' అంటూ పోయాడు వెంకడు, చీకటిలో లీనమయిపోతూ !!